సాక్షి
పెద్దపల్లి
మంగళవారం । 5 । ఆగస్టు । 2025



బీమా చెక్కులు అందజేత

ఎలిగేడు : కాల్వశ్రీరాంపూర్ మండలానికి చెందిన విద్యుత్ ప్రమాద బాధితులకు శివపల్లి లోని తన నివాసంలో ఎమ్మెల్యే విజయరమణా రావు సోమవారం బీమా చెక్కులు అందజేశారు.



కోటిలింగాలలో భక్తుల సందడి

వెల్గటూర్: కోటిలింగాల కోటేశ్వరస్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. శ్రావణ సోమ వారం సందర్భంగా గోదావరిలో స్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు.

గరిష్ఠం/కనిష్ఠం
33.0/26.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం అధికంగా ఉంటుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మృత్యుంజయ హోమం



పూజలు చేస్తున్న ఈడీ చందన్ కుమార్ సామంత

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ పీటీఎస్ ఆలయంలో సోమవారం మహా మృత్యుంజయ హోమం ఘనంగా నిర్వహించారు. అర్చకులు వామనశర్మ, రుద్రభట్ల శ్రీకాంత్ తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. ఎన్టీపీసీ రామగుండం – తెలంగాణ ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చందన్ కుమార్ సామంత, దీప్తి మహిళా సమితి అధ్యక్షురాలు రాఖీ సామంత హాజరయ్యారు. లోక కల్యాణం కోసం హోమం నిర్వహించారు. ఉన్నతాధికారులు, అధికారులు, అధికార సంఘం ప్రతినిధులతోపాటు ఉద్యోగ గుర్తింపు సంఘం ప్రధాన కార్యదర్శి ఆరెపల్లి రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దే రీసైక్లింగ్‌తో అనేక ప్రయోజనాలు



డీఆర్‌సీసీని పరిశీలిస్తున్న వెంకటస్వామి

కోల్‌సిటీ/ఫెర్టిలైజర్‌సిటీ: ఇంటి వద్దే రీసైక్లింగ్‌తో డంప్ యార్డ్‌కు వెళ్లే చెత్తను తగ్గించడానికి అవకాశం ఉంటుందని రామగుండం బల్దియా డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామి అన్నారు. 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా సోమవారం నగరంలో పలు కార్యక్రమాలు చేపట్టగా, డిప్యూటీ కమిషనర్ పర్యవేక్షించారు. గౌతమినగర్‌లోని డీఆర్‌సీసీతోపాటు కంపోస్ట్ యార్డ్, మల్కాపూర్ శివారులోని డంపింగ్‌యార్డ్‌లను వెంకటస్వామి సందర్శించారు. ఆయన మాట్లాడుతూ, చెత్తను ఇంటి వద్దనే తడి, పొడి చెత్తగా వేరుచేసి కంపోస్టింగ్ చేయాలన్నారు. అలాగే 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా రెవెన్యూ విభాగం ఆధ్వర్యంలో ఆస్తి పన్ను మదిపు చేయడం, పునఃపరిశీలించడం చేపట్టారు. ఆయా కార్యక్రమాల్లో నగరపాలక సంస్థ ఆర్వో ఆంజనేయులు, ఆర్‌ఐలు శంకర్ రావు, ఖాజా, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు, ఆర్పీలు, స్వశక్తి సంఘాల మహిళలు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కే హక్కు ఉంది



మాట్లాడుతున్న పెండ్యాల మహేశ్

రామగుండం: బ్రాహ్మణపల్లి/ముర్మూర్ ఎత్తిపోతలను ప్రారంభించే హక్కు కాంగ్రెస్ ప్రభుత్వానికే ఉందని ఆ పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పెండ్యాల మహేశ్ అన్నారు. అంతర్గాంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలోనే ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మించారని, దానికి అనుసంధానంగా ఎత్తిపోతల ఉందనే విషయాన్ని బీఆర్‌ఎస్ శ్రేణులు గుర్తించాలని సూచించారు. ఎత్తిపోతలను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రారంభించడాన్ని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ తప్పుపట్టడం శోచనీయమన్నారు. కాంగ్రెస్ ప్రతినిధులు ఉరిమెట్ల రాజలింగం, గాదె సుధాకర్, గుంట లక్ష్మణ్, కనకయ్య, శ్రీనివాస్‌గౌడ్, అప్పాల రాజేందర్, ఇండిబిల్లి రవి, ఒల్లెపు స్వామి, బాణాల రాములు, జూల లింగయ్య, జలీల్, అక్షయ్ పాల్గొన్నారు.

వార్షిక లాభాలు ప్రకటించాలి



మాట్లాడుతున్న భూపాల్

గోదావరిఖని: సింగరేణి బొగ్గు గనుల సంస్థ 2024–25 ఆర్థిక సంవత్సరంలో సాధించిన వార్షిక లాభాలు ప్రకటించి, అందులో కార్మికులకు 30 శాతం వాటా చెల్లించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్, ఎస్‌సీఈయూ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ప్రధాన చౌరస్తాలో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. కంపెనీలో రాజకీయ జోక్యం పెరిగి నిధులు దుర్వినియోగమవుతున్నాయని ఆరోపించారు. ఈక్రమంలోనే సంస్థ ఆర్థిక పరిస్థితి గురించి కార్మికులకు తెలియజేయాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉందని అన్నారు. నాయకులు వైవీ రావు, ఎరవెల్లి ముత్యంరావు, ఆరేపల్లి రాజమౌళి, మెండె శ్రీనివాస్, బానోతు వినయ్, కుంట ప్రవీణ్, కొమురయ్య, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

సాగు అంతంతే..

- పది మండలాల్లో లోటువర్షపాతం
- జిల్లాలో సాధారణం కన్నా తక్కువ నమోదు
- ఎల్లంపల్లి ప్రాజెక్టులో పూర్తిస్థాయిలో చేరని నీరు
- కుంటలు, చెరువులదీ అదేపరిస్థితి
- ఆందోళనలో అన్నదాతలు

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

2024- 2025లో సాగు ఇలా.. (ఎకరాల్లో)

పంట	2024	2025
వరి	2,10,027	1,43,153
మొక్కజొన్న	705	377
పత్తి	52,670	48,215
కందులు	169	87



పెద్దపల్లి శివారులోని ఓ పత్తి చేనులో వానకోసం ఎదురుచూస్తున్న అన్నదాత

సాక్షి పెద్దపల్లి: 'వానమ్మ.. వానమ్మ.. ఒక్కసారన్నా వచ్చిపోవే' అంటూ జిల్లా రైతాంగం వర్షాల కోసం ఎంతోఆశతో ఎదురుచూస్తోంది. ఆరంభంలో మురిపించినా ఆ తర్వాత జాడలేకుండా పోయింది. జిల్లాలో ఇప్పటివరకు లోటు వర్షపాతమే నమోదైంది. ఫలితంగా జిల్లాలో వర్షాభావ పరిస్థితులు కనిపిస్తున్నాయి. నిత్యం సెంటీ మీటర్లలో కురవాల్సిన వర్షం.. మి.మీ.లలో కూడా నమోదు కావడంలేదు.

సాగుకు అదను దాటుతోంది..

పంటలు పండించేందుకు అదను దాటుతోంది. ఈ వర్షాకాలం సీజన్‌లో జూన్, జూలైలో పెద్దగా వర్షాలు కురవలేదు. ఆగస్టు మొదటివారం గడుస్తున్నా వానజాడ లేదు. వర్షాలు లేక సాగుబాట పట్టకుండా చాలామంది రైతులు మిన్నకుండిపోయారు. చెరువులు, కుంటల్లో నీరున్న ప్రాంతాల్లో తప్ప ఎక్కడా పెద్దగా సాగులేదు. తొలకరిలో కురిసిన వర్షాలకు విత్తిన మెట్ట పంటలు కూడా ఎండిపోయాయి. ఇటీవల వారంపాటు ముసురు కురవడంతో మెట్ట పంటలు చిగురించాయి. ఆ వానలకు రైతులు కొంత ధైర్యం చేసి సాగుబాట పట్టారు. సాగు పుంజుకుంటున్న ఈ తరుణంలో వరుణుడు మళ్లీ ము ఖం చాటేయగా.. సాగు మళ్లీ డీలా పడిపోయింది.

సగానికి పడిపోయింది..

జిల్లాలో ఈ ఏడాది వర్షాభావంతో అన్నిమండలాల్లో సా గు విస్తీర్ణం సగానికి పడిపోయింది. గత వారంలో కురిసిన వర్షాలకు చెరువు లు, కుంటల్లోకి నీరు వచ్చిన దాఖాలా లు కనిపించ డం లేదు. ఆరుతడి పంటలకు మాత్రం జీవం పోసినట్లయ్యింది తప్పితే.. సా గు ఊపందుకో లేదు. ఈ సీజన్‌లో 2.40 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు కేవలం 1.91లక్షల ఎకరాల్లోనే సాగు చేశారు. ఈనెల 15వ తేదీ వరకు వరినాట్లు వేసుకోవచ్చని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

10 మండాల్లో లోటు వర్షపాతమే

ఈ వానాకలం సీజన్‌లో ఇప్పటివరకు 479.9 మి.మీ. వర్షాపాతం నమోదుకావాల్సి ఉండగా, 31 మి.మీ. లోటు వర్షపాతంతో 329.9 మి.మీ.గా నమోదైంది. జిల్లాలో 14 మండలాలు ఉండగా.. కేవలం మంథని, కాల్వశ్రీరాంపూర్, ఓదెల, సుల్తానాబాద్‌లోనే సాధారణ వర్షపాతం నమోదైంది. మిగిలిన 10 మండలాల్లో లోటు వర్షపాతమే ఉంది.

బోసిపోతున్న చెరువులు, ప్రాజెక్టులు

జిల్లాలో 1,018 చెరువులు ఉండగా 44 చెరువులు మత్తడి పోయగా, 25శాతం కూడా నిండని చెరువులు 327 ఉన్నాయి. మరోపక్క.. ఎల్లంపల్లి ప్రాజెక్టుకు సైతం వచ్చిచేరే వరద తక్కువగానే ఉంది. ప్రాజెక్టు గరిష్ఠ ఎత్తు 148 మీటర్లు కాగా ప్రస్తుతం 144 మీటర్ల ఎత్తు వరకు నీరు ఉంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 20.175 టీఎంసీలు కాగా 12.32 టీఎంసీలే ఉంది. గతేడాది ఇదేరోజు 15.75 టీఎంసీల నీరు నిల్వ ఉండేది. ప్రాజెక్టులోకి ఎగువ నుంచి 435 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లోగా వచ్చి చేరుతోంది. అలాగే అవుట్‌ఫ్లో 435 క్యూసెక్కులుగా ఉంది. హైదరాబాద్ మెట్రోపాలిటన్ స్కీం కోసం 314 క్యూసెక్కులు తరలిస్తుండగా.. ఎన్టీపీసీ అవసరాల కోసం మరో 121 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

జిల్లాలోని చెరువుల్లో నీటినిల్వలు

మొత్తం చెరువులు	1,018
0–25 శాతంలోపు	327
25–50 శాతంలోపు	199
50–75 శాతంలోపు	176
75–100శాతంలోపు	272
మత్తడి పడినవి	44

జూన్ 1 నుంచి ఆగస్టు 4వ తేదీ వరకు నమోదైన వర్షపాతం(మి.మీ.లలో)

కురవాల్సింది	474.9
కురిసింది	329.9
వ్యత్యాసం(శాతంలో)	31
వర్షం కురిసిన రోజులు	24

ఇంకా గడువుంది



వర్షాలు సమృద్ధిగా కురవకపోవడంతో ఈసారి సాగు అంతంతగానే ఉంది. ఈనెల 15వ తేదీ వరకూ వరి సాగుచేయొచ్చు. రెండు, మూడు భారీవర్షాలు పడితే పంటలకు ఢోకా ఉండదు.
– శ్రీనివాస్, డీఏవో

వినతులు స్వీకరించి.. పరిష్కార మార్గం చూపి..

- ప్రజావాణిలో అర్జీలు స్వీకరించిన అడిషనల్ కలెక్టర్ వేణు



దరఖాస్తులు స్వీకరిస్తున్న అడిషనల్ కలెక్టర్ వేణు

పెద్దపల్లిరూరల్: జిల్లా ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తే పరిశీలించి సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకునేందుకే ప్రతీ సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అడిషనల్ కలెక్టర్ వేణు తెలిపారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన జిల్లావాసుల నుంచి ఆయన సోమవారం ప్రజావాణి ద్వారా అర్జీలను స్వీకరించారు. వాటిని పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా కొందరిని 'సాక్షి' పలుకరించగా తమ వేదనను ఇలా వెల్లడించారు..

పింఛన్ ఇప్పించండి

నిరుపేద కుటుంబానికి చెందిన దివ్యాంగుడిని. కుటుంబ పోషణ భారంగా మారింది. దివ్యాంగుల పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్న. కానీ మంజూరు చేయడం లేదు. అర్హతలున్న నాకు పింఛన్ ఇప్పించి ఆదుకోవాలి.
– రమేశ్, పోచమ్మకాలనీ, కాల్వశ్రీరాంపూర్

చర్య తీసుకోండి

నిబంధనలు పాటించని ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి. కమాన్‌పూర్‌లోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో విద్యార్థులకు ఇబ్బంది కలిగించేలా తరగతులు నిర్వహిస్తున్నారు. విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలి.
– ఆర్ల సందీప్, జిల్లాల ప్రశాంత్, ఎస్‌ఎఫ్‌ఐ

రోడ్డు పనులు పూర్తిచేయాలి

నందిమేడారం – గోపాల్‌రావుపేట గ్రామాల మధ్య చేపట్టిన రోడ్డు నిర్మాణం అసంపూర్తిగా మిగిలింది. ప్రజలకు అసౌకర్యం కలుగుతోంది. వీలైనంత త్వరగా పనులు పూర్తయ్యేలా చూడాలి. ప్రజలు, వాహనదారుల రవాణా ఇబ్బందులు తొలగించాలి.
– గోపాల్‌రావుపేట వాసులు, ధర్మారం

న్యాయం చేయండి

మంథని మండలం కూచిరాజ్‌పల్లి గ్రామంలోని నక్కశేఖర్, వివేక్‌లకు చెందిన ఎకరం భూమిని ఇతరులు ఆక్రమించి సాగు చేస్తున్నారు. ఈ విషయమై సమగ్ర విచారణ జరిపి నిరుపేద దళిత కుటుంబానికి న్యాయం చేయాలని అదనపు కలెక్టర్‌కు విన్నవించాం.
– ప్రజాసంఘం నేతలు

ఉపాధి చూపండి

మా ఆయన కుతుబొద్దీన్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో కాలు పోగొట్టుకున్నాడు. ఏ పనీచేయలేని నిస్సహాయస్థితిలో ఉన్నాడు. మా కుటుంబపోషణ కష్టంగా ఉంది. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం ఇప్పించండి.
– పర్వీన్, పెద్దపల్లి

లక్ష్యానికి మించి మొక్కలు నాటాలి

- రామగుండం బల్దియా కమిషనర్ అరుణశ్రీ ఆదేశాలు



మాట్లాడుతున్న కమిషనర్ అరుణశ్రీ

కోల్‌సిటీ(రామగుండం): వన మహోత్సవం ద్వారా రామగుండం నగరంలో లక్ష్యానికి మించి మొక్కలు నాటాలని నగరపాలక సంస్థ కమిషనర్(ఎఫ్‌ఏసీ) అరుణశ్రీ సూచించారు. బల్దియా కార్యాలయంలో సోమవారం వన మహోత్సవం నిర్వహణపై వార్డు అధికారులతో వివిధ అంశాలపై సమీక్షించారు. కమిషనర్ మాట్లాడుతూ, డివిజన్లలో స్థలం లభ్యత ఆధారంగా వార్డు అధికారులకు మొక్కల సంఖ్య, లక్ష్యం నిర్దేశిచామన్నారు. మొక్కలు నాటే కార్యక్రమంలో స్థానికులను భాగస్వాములను చేయాలని అన్నారు. పశువుల నుంచి పరిరక్షించడానికి అవసరమైనచోట ట్రీ గార్డులను ఏర్పాటు చేయించాలని అన్నారు. ప్రస్తుత వాతావరణ అనుకూలతలను దృష్టిలో ఉంచుకొని ఎక్కువసంఖ్యలో మొక్కలు నాటాలని ఆదేశించారు. మెప్మా ఆర్పీల సహకారం తీసుకొని ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేయాలని కమిషనర్ సూచించారు. డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రామన్, డీఈఈ షాబాజ్, ఏఈ తేజస్విని, మెప్మా టీఎంసీ మౌనిక, సీవోలు ఊర్మిళ, శ్వేత, ప్రియదర్శిని, శమంత తదితరులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణపై లోకాయుక్తలో ఫిర్యాదు

పెద్దపల్లిరూరల్: పెద్దబొంకూర్ గ్రామ శివారులోని తన ఎనిమిది గుంటల భూమిని అక్రమంగా కొందరు ఆక్రమించుకున్నారని, ఆ భూమి తనకు ఇప్పించాలని సుల్తానాబాద్ మండలం చిన్నకల్వల గ్రామానికి చెందిన కల్వల శంకర్ సోమవారం లోకాయుక్తలో ఫిర్యాదు చేసినట్లు విలేకరులకు తెలిపారు. తనకున్న 45 గుంటల్లోంచి 8 గుంటలను దొడ్డిదారిన పట్టా చేసిన 13 మంది అధికారులపై క్రైం నంబరు 282/2024 ద్వారా కేసు కూడా నమోదైందని ఆయన పేర్కొన్నారు. తన భూమి తనకు దక్కేలా చూడడంతో పాటు అక్రమాలకు పాల్పడ్డ, కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని శంకర్ కోరారు.

నేడు బీజేపీ అధ్యక్షుడి రాక



మాట్లాడుతున్న సంజీవరెడ్డి తదితరులు

పెద్దపల్లిరూరల్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు జిల్లా పర్యటనకు వస్తున్నారు. జిల్లా కేంద్రంలో మంగళవారం జరిగే ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొంటారు. ఈ విషయాన్ని వెల్లడించేందుకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్ వర్గీయులు చిలారపు పర్వతాలు, రాజగోపాల్ తదితరులు సోమవారం వేర్వేరుగా సమావేశాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమ వివరాలపై చర్చించకుండానే పరస్పర దూషణలకు దిగినట్లు ప్రచారం సాగుతోంది. అయితే, కొత్త రథసారథితోనైనా అసంతృప్తులకు చెక్‌పెట్టి పార్టీని బలోపేతం చేయాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

కాషాయజెండాలు.. ఫ్లెక్సీలు..

పట్టణంలోని ఏ రోడ్డులో చూసినా కాషాయ జెండాలు, నేతల ఫ్లెక్సీలతో నిండిపోయి కనిపిస్తున్నాయి. కాగా, మొన్నటివరకు బీఆర్‌ఎస్‌లో ఉన్న నల్ల మనోహర్‌రెడ్డి తన అనుచరులతో కలిసి బీజేపీ సభ్యత్వం పొందేందుకు ప్రయత్నిస్తున్న విషయం తెలిసిందే.

సత్తాచాటిన సింబా నార్కోటిక్ డాగ్

- రాష్ట్రస్థాయి డ్యూటీ మీట్‌లో గోల్డ్‌మెడల్



సింబాను అభినందిస్తున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

గోదావరిఖని: సింబా నార్కోటిక్ డాగ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తాచాటి బంగారు పతకం సాధించింది. వరంగల్ జిల్లా మామునూరు పీటీసీలో జరిగిన తెలంగాణ రాష్ట్రరెండో పోలీస్ డ్యూటీ మీట్‌లో కాళేశ్వరం జోన్ నుంచి నార్కోటిక్ డాగ్ విభాగంలో సింబా పాల్గొని గంజాయి, మత్తు పదార్థాలను గుర్తించడంలో సత్తా చాటింది. పోలీసు జాగిలం సింబా, డాగ్ హ్యాండ్లర్ ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ ఎం.వేణుగోపాల్‌కృష్ణ గోల్డ్ మెడల్ సాధించారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ పోలీస్ డాగ్‌గా 'సింబా' ఎంపికైంది. రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా సింబా, డాగ్ హ్యాండ్లర్ వేణుగోపాలకృష్ణను అభినందించారు. మంచిర్యాల, పెద్దపల్లి డీసీపీలు భాస్కర్, కరుణాకర్, ట్రాఫిక్, ఏఆర్ ఏసీపీలు శ్రీనివాస్, ప్రతాప్, ఆర్‌ఐలు దామోదర్, శ్రీనివాస్, వామనమూర్తి, సంపత్, మల్లేశం పాల్గొన్నారు.

193 మంది పిల్లలకు విముక్తి

రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో చేపట్టిన 11వ ఆపరేషన్ ముస్కాన్, ఆపరేషన్ స్మైల్ ద్వారా 193 మంది చిన్నారులకు విముక్తి కల్పించామని, ఈ సందర్భంగా 18 మందిపై కేసులు నమోదు చేశామని పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా తెలిపారు. ఈ ఏడాది జూలై 1 నుంచి 31వ తేదీ వరకు ఈ కార్యక్రమాలు చేపట్టామని, అన్ని శాఖల సమన్వయంతో విజయవంతం చేశామన్నారు. బాలలను పనిలో పెట్టుకున్నా, పనిచేసినా, తప్పిపోయినా వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 (చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్), డయల్ 100 నంబరుకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సీపీ కోరారు.

చదవాలి.. రాయాలి

- మహిళా సంఘాల్లో నిరక్షరాస్యుల కోసం 'ఉల్లాస్'
- మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో కార్యక్రమం
- జిల్లా విద్యాశాఖ, సెర్ప్ ఆధ్వర్యంలో నిర్వహణకు ప్రత్యేక ప్రణాళిక



నిరక్షరాస్యులను గుర్తించేందుకు సమావేశమైన మహిళా సంఘం సభ్యులు

రామగిరి(రామగుండం): మహిళా సంఘాల్లో నిరక్షరాస్యులైన మహిళలను సంపూర్ణ అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు జిల్లా విద్యాశాఖ, సెర్ప్ అధికారులు సమన్వయంతో 'ఉల్లాస్' పథకాన్ని పకడ్బందీగా అమలు చేసేలా కార్యాచరణ రూపొందించారు. అందరికీ విద్య అందించాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అండర్ స్టాండింగ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ అల్ ఇన్ సొసైటీ(ఉల్లాస్) పథకాన్ని అమలులోకి తీసుకొచ్చాయి. దీనిని జిల్లావ్యాప్తంగా దశల వారీగా అమలు చేసేలా జిల్లా ఉన్నతాధికారులు ప్రణాళికతో ముందుకెళ్తున్నారు. తొలుత మహిళా సంఘాల్లో నిరక్షరాస్యులను గుర్తించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దుతారు. రెండోదశలో మధ్యలో బడిమానేసిన వారిని గుర్తించి ఓపెన్ స్కూల్ ద్వారా నేరుగా పదో తరగతి చదివిస్తారు. ఆసక్తినిబట్టి ఓపెన్ డిగ్రీ వరకూ చదివించాలనేది ప్రభుత్వ లక్ష్యం.

ఉల్లాస్ కార్యక్రమం లక్ష్యం ఇదే..

సామాజిక సాధికారతలో భాగంగా ఉల్లాస్ కార్యక్రమం ద్వారా చదువురాని వారందరికీ చదవడం, రాయడం నేర్పించడమే ప్రధాన లక్ష్యం. మహిళా సంఘాల్లోని సభ్యుల్లో కేవలం 50 శాతం మందికే సంతకం చేయడం వచ్చని, మిగిలినవారు వేలిముద్ర వేస్తున్నారని ప్రభుత్వం గుర్తించింది. ఈక్రమంలోనే మహిళలు అందరికీ చదవడం, రాయడం నేర్పించాలనే లక్ష్యంతో ఉల్లాస్‌ను అమలులోకి తీసుకొస్తున్నారు. ఓపెన్ టెన్త్, ఓపెన్ డిగ్రీ వరకు చదివించడమే కాదు.. ఆసక్తిని బట్టి స్కిల్‌డెవలప్‌మెంట్, టెక్నికల్ కోర్సుల్లోనూ చేర్పించి ఉపాధి, అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నారు. బ్యాంకింగ్ రంగంలో ఆర్థిక క్రమశిక్షణ, పౌష్టికాహారం, వ్యక్తిగత పరిశుభ్రత తదితర అంశాలను సైతం ఈ సందర్భంగా నేర్పిస్తారు. కార్యక్రమ నిర్వహణకు జిల్లా, మండలస్థాయి కమిటీలను ఇప్పటికే ఏర్పాటు చేశారు. కలెక్టర్ చైర్మన్‌గా, డీఈవో కన్వీనర్‌గా, డీపీవో, ఇతర శాఖల అధికారులు సభ్యులుగా ఉంటారు. అదేవిధంగా మండల కమిటీలో చైర్మన్‌గా ఎంపీడీవో, ఎంఈవో, హెచ్‌ఎం, సీఆర్పీలు సభ్యులుగా కొనసాగుతారు.

తల్లి చదువుతో కుటుంబంలో వెలుగులు..

తల్లి చదవడం ద్వారా ఆ కుటుంబంలో వెలుగులు ప్రసరిస్తాయని, ఇలాంటి కుటుంబాల ద్వారా ఆ గ్రామం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందని సర్కార్ భావిస్తోంది. బడికి వెళ్లే పిల్లల సంఖ్య పెరగడంతోపాటు డ్రాపౌట్స్ తగ్గితే బాల్య వివాహాలపై అవగాహన పెరుగుతుందని చెబుతోంది. అక్షరాస్యులుగా మారడం ద్వారా ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలపై అవగాహన పెరిగి అర్హులందరికీ ప్రయోజనాలు చేకూరుతాయని పేర్కొంటోంది.

వలంటీర్లుగా మహిళా సంఘాల్లోని అక్షరాస్యులైన సభ్యులు..

డీఆర్‌డీవో, సెర్ప్ ఆధ్వర్యంలో నిరక్షరాస్యులను గుర్తించే ప్రక్రియ జిల్లాలో ఇప్పటికే పూర్తిచేశారు. 15 మంది నుంచి 20 మందితో గ్రూపును ఏర్పాటు చేశారు. మహిళా సంఘాల్లోని అక్షరాస్యులైన వారిని వలంటీర్లుగా ఎంపిక చేసి గ్రూపులను కేటాయించి చదువు చెప్పిస్తారు. గ్రూపు సభ్యులు చదవడం, రాయడం వచ్చే వరకు చదువు చెప్పే బాధ్యత వలంటీర్లకే అప్పగించారు. ఇందుకోసం పారితోషికం, గౌరవ వేతనం లేకుండానే కేవలం స్వచ్ఛందంగానే చదువు చెప్పాల్సి ఉంటుంది. అవసరమైన పుస్తకాలను విద్యాశాఖ అందిస్తుంది. ఉపాధ్యాయుల ద్వారా వలంటీర్లకు సహకారం అందిస్తుంది.

మహిళా సంఘాల్లో నిరక్షరాస్యులు

జిల్లాలోని వివిధ మండలాల్లో గల మహిళా సంఘాల్లో ఇంకా చదవడం, రాయడం రాని మహిళలను అధికారులు ఇటీవల గుర్తించారు. అంతర్గాం మండలంలో 2,017 మంది, రామగుండం మండలంలో 1,711 మంది, పాలకుర్తి మండలంలో 2,609 మంది, మంథని మండలంలో 3,818 మంది, ముత్తారం మండలంలో 2,617 మంది, రామగిరి మండలంలో 2,317 మంది, కమాన్‌పూర్ మండలంలో 2,277 మంది, ధర్మారం మండలంలో 4,813 మంది, జూలపల్లి మండలంలో 2,349 మంది, ఎలిగేడు మండలంలో 2,642 మంది, సుల్తానాబాద్ మండలంలో 3,727 మంది, ఓదెల మండలంలో 3,056 మంది, కాల్వశ్రీరాంపూర్ మండలంలో 2,192 మంది, పెద్దపల్లి మండలంలో 5,311 మంది ఉన్నారని అధికారులు సర్వేలో తేల్చారు. ఇలా జిల్లావ్యాప్తంగా ఉన్న మహిళా సంఘాల్లో మొత్తం నిరక్షరాస్యులైన మహిళలు 41,456 మంది ఉన్నారని అధికారులు గుర్తించారు.

మహిళలకు మంచి అవకాశం



చదవడం, రాయడం నేర్పించాలనే లక్ష్యంతో ఉల్లాస్ అమలు చేస్తున్నాం. జిల్లాలోని మహిళా సంఘాల్లో గల నిరక్షరాస్యుల వివరాలను వయోజన విద్యాశాఖాధికారులకు అందజేశాం. నిరక్షరాస్యులు, మధ్యలో బడి మానేసిన వారికి, దివ్యాంగులకు సైతం చదవడం, రాయడం నేర్పిస్తారు. నిరక్షరాస్యులైన మహిళలకు ఇది మంచి అవకాశం.
– కాళిందిని, డీఆర్డీవో

లక్ష్యం 28వేల మంది..

తొలిదశలో సుమారు 28 వేల మంది నిరక్షరాస్యులైన మహిళా సంఘాల్లోని సభ్యులను అక్షరాస్యులు గా మార్చాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఇందుకోసం వచ్చే ఏడాది మార్చి వరకు గడువు విధించారు. ఇందులో భాగంగానే ఈనెల 7న నిర్వహించే సమావేశంలో వలంటీర్లకు శిక్షణ ఇవ్వాలనే అంశంపై నిర్ణయం తీసుకుంటారు. శిక్షణ పూర్తయ్యాక మండలాల వారీగా బోధన తరగతులు ప్రారంభిస్తారు.

క్లుప్తంగా

కాశీ సమీపంలో చల్‌గల్ వాసి ఆత్మహత్య


మోహన్ (ఫైల్)

జగిత్యాలక్రైం: నాలుగు రోజుల క్రితం కనిపించకుండాపోయిన జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ గ్రామానికి చెందిన ఆర్టీసీ రిటైర్డ్ కండక్టర్ మల్యాల మోహన్ (65) ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం కాశీ సమీపంలోని మీర్జాపూర్ బ్రిడ్జి వద్ద పురుగుల మందు తాగి అపస్మారకస్థితిలో కనిపించాడని, స్థానికులు ఆస్పత్రిలో చేర్పించగా అప్పటికే మృతిచెందినట్లు అక్కడి పోలీసులు.. జగిత్యాల రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. చల్‌గల్‌కు చెందిన మోహన్ గతనెల 31న ఉదయం ఇంటి నుంచి వెళ్లాడు. కాశీ సమీపంలోని మీర్జాపూర్ వద్ద క్రిమిసంహారక మందుతాగి అపస్మారక స్థితిలో ఉండగా.. అక్కడి స్థానికులు ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు రూరల్ ఎస్సై సదాకర్ తెలిపారు. కుటుంబ సభ్యులు మృతదేహాన్ని స్వగ్రామం తీసుకొచ్చేందుకు ఉత్తర్‌ప్రదేశ్‌కు బయల్దేరి వెళ్లారు. మోహన్‌కు భార్య రాధ, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఉరేసుకుని వ్యాపారి..


ముకుందు ఆదిరెడ్డి(ఫైల్)

మల్యాల: వ్యాపారంలో నష్టం రావడంతో మల్యాలకు చెందిన ముకుందు ఆదిరెడ్డి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై నరేశ్‌కుమార్ కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఆదిరెడ్డి(59) లారీ బిజినెస్ చేస్తున్నాడు. వ్యాపారంలో నష్టం రావడంతో కొంతకాలంగా మానసికంగా బాధపడుతున్నాడు. ఆదివారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. సోమవారం వేకువజామున భార్య నిద్ర లేచి చూసి, జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడని వైద్యులు నిర్ధారించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీతకార్మికుడి మృతి


లింగయ్య(ఫైల్)

ఎలిగేడు(పెద్దపల్లి): ముప్పిరితోట గ్రామానికి చెందిన గీతకార్మికుడు కోట లింగయ్య(55) తాటిచెట్టు పైనుంచిపడి మృతి చెందినట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. లింగయ్య రోజూమాదిరిగానే సోమవారం ఉదయం కల్లు గీసేందుకు తాటిచెట్టు ఎక్కాడు. కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు కిందకు పడిపోయాడు. సమీపంలోని ఓ రైతు చూసి వెంటనే కుటుంబసభ్యులకు ఫోన్‌ద్వారా సమాచారం అందించారు. వారువచ్చి కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈమేరకు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

జగిత్యాలక్రైం: జగిత్యాల శివారు లింగంపేట శివాజీ చౌరస్తా వద్ద గర్వందుల శ్రీహరి (55) ద్విచక్రవాహనం అదుపుతప్పి కంకర కుప్పకు ఢీకొని మృతిచెందారు. జగిత్యాల రూరల్ మండలం అంతర్గాంకు చెందిన శ్రీహరి ఆదివారం తన భార్య రమతో కలిసి జగిత్యాలలో ఓ వివాహానికి హాజరయ్యారు. రమను జగిత్యాలలోనే ఉంచి రాత్రి 11 గంటల సమయంలో అంతర్గాం బయల్దేరాడు. శివాజీ చౌరస్తా వద్ద రోడ్డు పక్కనున్న కంకరకుప్పను ఢీకొని తలకు బలమైన గాయాలవడంతో మృతిచెందాడు. రమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై కుమారస్వామి తెలిపారు.


కనకసోమేశ్వరస్వామి ఆలయం వద్ద కిక్కిరిసిన భక్తులు


స్వామివారికి వరదపాశంతో పూజలు చేస్తున్న భక్తులు

భక్తజనసంద్రంగా సోమన్నగుట్ట

మల్లాపూర్: మల్లాపూర్‌లోని శ్రీకనకసోమేశ్వర స్వామివారి కొండ శ్రావణ రెండో సోమవారం సందర్భంగా భక్తులతో కిక్కిరిసిపోయింది. కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. కొనేరులో పుణ్యస్నానం ఆచరించి స్వామివారికి ప్రీతిపాత్రమైన వరదపాశంను వండి నైవేద్యంగా సమర్పించారు. ఆలయ కమిటీ చైర్మన్ సంగ గంగరాజం, వైస్ చైర్మన్ ఇల్లెందుల తుక్కారాం, ఆలయ ప్రధానార్చకులు బల్యపెల్లి ప్రభాకర్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.


కొండపై స్వామివారి ఆలయం

వానాకాలంలో సూర్యప్రతాపం


చెర్లభూత్కూర్‌లో ఉదయం పూట నాటేస్తున్న మహిళలు

- వేసవిని తలపిస్తున్న ఎండలు
- ఆగస్టు పైనే రైతుల ఆశలు

కరీంనగర్‌రూరల్: వానాకాలంలో ఎండల తీవ్రతకు ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. వానాకాలం సీజన్ ప్రారంభమై రెండు నెలలు దాటుతుండగా జిల్లావ్యాప్తంగా పగటి ఉష్ణోగ్రతలు 35 డిగ్రీలు దాటుతుండటంతో ఆందోళన చెందుతున్నారు. వారం రోజుల నుంచి సూర్యుడి ప్రతాపం రోజు రోజుకు పెరుగుతోంది. అప్పుడప్పుడు కురుస్తున్న చిరుజల్లులు ఎండ తీవ్రతను తగ్గించలేకపోవడంతో పగలు ఎండ, ఉక్కపోతతో జనం అల్లాడుతున్నారు. వర్షాలు కురవాల్సిన సమయంలో ఎండ కాస్తుండటంతో సామాన్య ప్రజలతోపాటు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంటలకు సాగునీళ్లందించేందుకు పడరానిపాట్లు పడుతున్నారు. ఆగస్టులోనైనా భారీ వర్షాలు కురుస్తాయనే ఆశతో రైతులు నిరీక్షిస్తున్నారు.

ఉదయం 10గంటలకే..

పగటిపూట ఎండ వేసవిని తలపిస్తోంది. ఉదయం 10గంటలు దాటితే సుర్రుమంటోంది. సాయంత్రం సమయంలో వాతావరణం చలబడుతున్నా ఉక్కపోతతో ప్రజలు రాత్రంతా ఇబ్బందిపడుతున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఆరురోజులపాటు తేలికపాటి వర్షాలు కురిసినా అనంతరం వరుణుడు ముఖం చాటేయడంతో క్రమంగా ఎండల తీవ్రత పెరుగుతోంది. మరో మూడురోజుల పాటు ఎండల తీవ్రత ఉండే అవకాశముందని వాతావరణశాఖ సూచనలు జారీ చేస్తోంది.

జ్వరాలబారిన జనం

జిల్లా వ్యాప్తంగా నెలకొన్న అసాధారణ వాతావరణ ప్రభావంతో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులు, ఉక్కపోత కారణంగా చర్మవ్యాధులు, జ్వరం, జలుబు, గొంతునొప్పి తదితర వ్యాధులు ప్రబలుతున్నాయి. పలు గ్రామాల్లో పారిశుధ్య లోపంతో వైరల్ జ్వరాలు వ్యాపించడంతో బాధితులు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు.

ఆకాశంవైపు ఆశగా..

కార్తెలన్నీ కరిగిపోతున్నాయే తప్ప వర్షాలు మాత్రం కురవడంలేదు. రోజూ ఆకాశంలో కమ్ముకుంటున్న మేఘాలు వర్షించకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వానాకాలం సీజన్ ఆరంభంలో మురిపించిన వరుణుడు అనంతరం ముఖం చాటేయడంతో జిల్లాలో వర్షభావ పరిస్థితులు నెలకొన్నాయి. అప్పుడప్పుడు కురుస్తున్న వర్షాలతో చెరువులు, కుంటల్లోకి నీళ్లు చేరలేదు. జిల్లావ్యాప్తంగా ఇప్పటి వరకు 389.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 373.7 మిల్లీమీటర్లు నమోదైంది. గంగాధర, రామడుగు, చొప్పదండి మండలాల్లో లోటు వర్షపాతం నమోదు కాగా మిగతా మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. బావులు, బోర్లపై ఆధారపడిన రైతులు పొలాలను దున్ని వరినాట్లేస్తున్నారు. వర్షాలు కురవకపోతే బావులు, బోర్లు కూడా ఎండిపోతాయేమోనని ఆందోళనవ్యక్తం చేస్తున్నారు. ఆగస్టులోనైనా వర్షాలు కురుస్తాయనే ఆశతో ఎదురుచూస్తున్నారు.

అంతర్‌జిల్లా దొంగ అరెస్ట్

- 19 తులాల బంగారం, 164 తులాల వెండి, నగదు స్వాధీనం
- చోరీ సొత్తును కొనుగోలు చేసిన వ్యక్తి సైతం అరెస్ట్
- వివరాలు వెల్లడించిన సీపీ గౌస్ ఆలం



వివరాలు వెల్లడిస్తున్న సీపీ గౌస్ ఆలం

కరీంనగర్‌క్రైం: కమిషనరేట్ పరిధిలోని వివిధప్రాంతాల్లో చోరీలకు పాల్పడిన అంతర్‌జిల్లా దొంగతో పాటు అతడి వద్ద నగలు కొన్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం కమిషనరేట్ కేంద్రంలో సీపీ గౌస్ ఆలం వివరాలు వెల్లడించారు. నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి గ్రామానికి చెందిన టేకు చిరంజీవి ప్రస్తుతం ఆర్మూర్‌లో నివాసముంటున్నాడు. హార్వెస్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ జల్సాలకు అలవాటుపడ్డాడు. కరీంనగర్ జిల్లాలోని రామడుగు, మానకొండూర్, ఎల్‌ఎండీ, చిగురుమామిడి, గన్నేరువరం, నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండల పరిధిలోని దొంగతనాలకు పాల్పడ్డాడు. కేవలం 2 నెలల వ్యవధిలోనే 19 తులాల బంగారం, 164 తులాల వెండి, రూ.1 లక్ష నగదు చోరీ చేశాడు. తాళం వేసిన ఇళ్లను ముందస్తుగా గుర్తించి అక్కడే ఉండి గూగుల్ లొకేషన్ ద్వారా ప్రదేశాన్ని గుర్తుపెట్టుకొని రాత్రి అదే ఇళ్లలోకి ప్రవేశించి నగలు, సొత్తు దొంగిలించేవాడు. తిమ్మాపూర్ పరిధిలో వాహనాలు తనిఖీలు చేస్తుండగా చిరంజీవి పట్టుబడ్డాడు. అతడిని పోలీసులు విచారించగా దొంగతనం చేసిన సొత్తును నిజామాబాద్ జిల్లా నందిపేట గ్రామంలో బంగారు నరసయ్యకు విక్రయించాడు. దీంతో పోలీసులు అతడిని కూడా అరెస్టు చేశారు. ఈ కేసులో మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు సీపీ వెల్లడించారు. ఇటీవల నిందితుడు చిరంజీవి భార్యకు కరీంనగర్‌లోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో సర్జరీ కాగా ఈ ప్రాంతంలో తిరిగి దొంగతనాలకు ఎంచుకున్నట్లు పోలీసుల విచారణలో ఒప్పుకున్నాడు. ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితులను పట్టుకోవడంలో కీలకపాత్ర పోషించిన కరీంనగర్ టౌన్ ఏసీపీ వెంకటస్వామి, సీసీఎస్ ఏసీపీ నర్సింహులు, సీఐలు సదన్‌కుమార్, ప్రకాశ్, ఎల్‌ఎండీ ఎస్సై శ్రీకాంత్, క్రైం పార్టీ కానిస్టేబుళ్లు నరేశ్, జైపాల్, రాజశేఖర్, వేణుగోపాల్, అనిల్ అవినాష్‌ను సీపీ అభినందించారు.

కళారంగానికి మల్లయ్య సేవలు చిరస్మరణీయం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- వెల్ది హరిప్రసాద్‌కు నాగుల మల్లయ్య అవార్డు ప్రదానం


అవార్డు అందజేస్తున్న విప్ ఆది శ్రీనివాస్

సిరిసిల్లటౌన్: కళారంగానికి మల్లయ్య సేవలు చిరస్మరణీయమని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కొనియాడారు. సిరిసిల్ల టౌన్‌క్లబ్‌లో సోమవారం నిర్వహించిన నాగుల మల్లయ్య పురస్కార అవార్డుల ప్రదానోత్సవానికి హాజరై మాట్లాడారు. ఈ ప్రాంతం నుంచి నాగుల మల్లయ్య బీసీల కోసం పోరాడిన తొలితరం నాయకుడు అని కొనియాడారు. ఆయన పోరాట పటిమ బలహీనవర్గాలకు ఆదర్శనీయమన్నారు. గత 38 ఏళ్లుగా మల్లయ్య పేరిట వివిధ కళారంగాలకు వారికి పురస్కారాలు అందజేయడంపై కుటుంబ సభ్యులను అభినందించారు. చేనేతలో ఖండాంతరాల్లో ఖ్యాతి సంపాదిస్తున్న సిరిసిల్ల చేనేత శిల్పి వెల్ది హరిప్రసాద్‌ను శాలువాతో సన్మానించి అవార్డు ప్రదానం చేశారు. అవార్డు కమిటీ చైర్మన్ నాగుల సత్యనారాయణగౌడ్, కన్వీనర్లు ఎండీ సలీం, నాగుల సంతోష్‌గౌడ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, ఏఎంసీ చైర్మన్ వెల్ముల స్వరూపరెడ్డి, టీపీసీసీ కోఆర్డినేటర్ సంగీతం శ్రీనివాస్, బుర్ర నారాయణగౌడ్, ఆడెపు చంద్రకళ పాల్గొన్నారు.

శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో హుండీల చోరీ

మల్యాల: మండలంలోని రాంపూర్ శివారులోగల భవానీ గుట్టపై ఉన్న శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి హుండీలను పగులగొట్టారు. నగదు ఎత్తుకెళ్లారు. ఆలయ అర్చకుడు సంగ ఎర్రన్న సోమవారం ఉదయం ఆలయానికి వెళ్లగా.. ఆలయం తాళాలు పగులగొట్టి ఉండడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. గర్భగుడిలో తాళం పగులగొట్టి, రెండు హుండీలను పగులగొట్టి సుమారు ఆరు వేల నగదు ఎత్తుకెళ్లారని ఆలయ కమిటీ చైర్మన్ నల్ల రాజేందర్ రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

భక్తుల పర్సులు..

వేములవాడ: రాజన్న దర్శనానికి వచ్చే భక్తుల బ్యాగులు, పర్సులు చోరీలకు పాల్పడుతున్న నలుగురిని ఆలయ ఎస్పీఎఫ్ సిబ్బంది పట్టుకున్నారు. సోమవారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉండడంతో ఇదే అదునుగా భక్తుల పర్సులు, డబ్బులు దొంగలిస్తున్న పట్టణానికి చెందిన ఇద్దరు మైనర్ బాలురు, బోయినపల్లి మండలం కోరెంకు చెందిన ఒక మైనర్ బాలిక, మంచిర్యాల జిల్లాకు చెందిన సమ్మక్క(24) ఉన్నట్లు ఎస్పీఎఫ్ సిబ్బంది తెలిపారు. వీరిని పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని పోలీసులు తెలిపారు.

ఆస్పత్రుల్లో మందుల కొరత లేదు

- రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ రవీందర్‌నాయక్


వైద్యులతో మాట్లాడుతున్న హెల్త్ డైరెక్టర్ రవీందర్‌నాయక్

కరీంనగర్‌టౌన్: రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఎలాంటి మందుల కొరత లేదని రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రవీందర్‌నాయక్ అన్నారు. సోమవారం కరీంనగర్ జిల్లా పర్యటనలో భాగంగా ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి వచ్చిన పేషెంట్లకు అందుతున్న వైద్య సేవలు, మందులు అందుబాటులో ఉన్నాయా.. లేదా అనే అంశంపై పరిశీలించారు. అనంతరం సూపరింటెండెంట్, డీఎంహెచ్‌వో, వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించి పరిసరాల శుభ్రత తదితర విషయాలను తెలియజేయాలన్నారు. సిజేరియన్ ప్రసవాలు తగ్గించి, సాధారణ ప్రసవాలు పెంచాలన్నారు. నాన్ కమ్యూనల్ డిసీజెస్ (ఎన్‌సీడీ)కు సంబంధించి, సీజనల్ వ్యాధుల మందులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. అనంతరం నగరంలోని అపోలోరీచ్, పలు ప్రైవేటు ఆస్పత్రులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వీరారెడ్డి, డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ, ఆర్‌ఎంవో డాక్టర్ నవీన, డీటీసీవో డాక్టర్ రవీందర్‌రెడ్డి, స్వామి, రాంనాథమ్, వైద్యులు పాల్గొన్నారు.


స్వామివారి దర్శనం కోసం ఆలయంలో భక్తులు


కల్యాణ మొక్కుల్లో భక్తులు

జాతరో.. జాతర

వేములవాడ: శ్రావణ సోమవారం సందర్భంగా వేములవాడ రాజన్నను 50 వేలకు పైగా భక్తులు దర్శించుకున్నారు. వేకువజాము నుంచే భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ధర్మగుండంలో స్నానాలు, కల్యాణకట్టలో తలనీలాలు, నిలువెత్తు బెల్లం పంపిణీ, కోడె మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల ద్వారా రూ.45లక్షల ఆదాయం సమకూరింది.

సొసైటీ సభ్యులకు మూడేళ్ల జైలు

సిరిసిల్లకల్చరల్: నేతకార్మికులను మోసగించిన కేసులో ఐదుగురికి మూడేళ్ల జైలు విధిస్తూ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ సోమవారం తీర్పు వెల్లడించారు. సిరిసిల్ల టౌన్‌సీఐ కృష్ణ తెలిపిన వివరాలు. నేతకార్మికులకు పని కల్పించి వారిని ఆదుకునే క్రమంలో ప్రభుత్వం మాక్స్ సొసైటీలకు వస్త్రోత్పత్తి ఆర్డర్లు ఇచ్చింది. జాగృతి మ్యాక్ సొసైటీ ప్రతినిధులు కొండబత్తిని మల్లేశం, బొల్లబత్తి లక్ష్మీనారాయణ, కట్ల శ్రీనివాస్, చింతకింది సత్యం, బొడ్డు గోపాల్ స్వలాభాపేక్షతో సొసైటీ సభ్యులతో వస్త్రోత్పత్తి చేయించకుండా ఇతర ప్రాంతాల నుంచి నేరుగా కొనుగోలు చేసి ప్రభుత్వానికి విక్రయించారు. ఈక్రమంలో సదరు వస్త్రాలను సిరిసిల్లలోని గోదాముకు తీసుకురాగా జౌళిశాఖ సాంకేతిక అధికారులు వస్త్రాలను కొనుగోలు చేయకుండా నిలిపేశారు. జౌళీశాఖ ఏడీ అశోక్‌రావు తనిఖీ చేసి 2017 మే 29న సుమారు రూ.13లక్షల సరకును సీజ్ చేయడంతోపాటు సొసైటీ సభ్యులు ఐదుగురిపై ఫిర్యాదు చేశారు. సొసైటీ ప్రతినిధులు కార్మికులతోపాటు ప్రభుత్వాన్ని కూడా మోసం చేశారని రుజువు కావడంతో ఐదుగురికి మూడేళ్ల జైలు, రూ.5వేల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు.

బర్త్ సర్టిఫికెట్ .. కష్టాలు అనేకం

- బర్త్ సర్టిఫికెట్ కోసం తప్పని తిప్పలు
- దండుకుంటున్న దళారులు
- అయినా పనికావడం లేదంటున్న బాధితులు

'కరీంనగర్ రూరల్ మండలం ముగ్దంపూర్‌కు చెందిన స్వప్న 20ఏళ్లుగా బీడీలు చుడుతూ జీవనోపాధి పొందుతోంది. ఈపీఎఫ్, ఆధార్ కార్డులో వేర్వేరుగా పుట్టిన తేదీలు నమోదయ్యాయి. ఆధార్‌లో ఉన్నట్లే ఈపీఎఫ్‌లో ఉండాలనేది నిబంధన. ఇందుకు జనన ధ్రువీకరణ పత్రం తీసుకోవడం సమస్యగా మారింది. పుట్టింటి చిరునామాతో జనన ధ్రువీకరణ పత్రం జారీ అవుతోంది. దీంతో ఈపీఎఫ్‌లో ఉన్న చిరునామాకు సరిపోలడం లేదు'.

'కొత్తపల్లికి చెందిన మల్లయ్య కూతురు లండన్‌లో విద్యనభ్యసిస్తోంది. ఆధార్‌లో ఒకలా, సర్టిఫికెట్లలో మరోలా పుట్టిన తేదీలు ఉండడం సమస్యగా మారింది. జనన ధ్రువీకరణ పత్రం తీసుకోవాలని కూతురు కోరడంతో రెవెన్యూ కార్యాలయంలో ఓ దళారీని ఆశ్రయించి రూ.5వేలు అప్పగించాడు. వారం రోజుల్లో ఇప్పిస్తానని చెప్పగా ఆరు నెలలవుతోంది'.



కరీంనగర్ అర్బన్: బర్త్ సర్టిఫికెట్ తలనొప్పిగా మారింది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కొరవడటంతో ఇబ్బందులు తప్పడం లేదు. 50సంవత్సరాల క్రితం జన్మించిన వారికి పుట్టిన తేదీ తెలియదు. అప్పట్లో ఎవరైనా ఇంట్లో ఏదో ఒక చోట తేదీ, సమయం రాసి పెట్టి ఉంటే సరి. లేదంటే నెల, ఏడాది అటో ఇటో చెప్పి ధ్రువీకరణ పత్రాల్లో నమోదు చేయించుకున్నారు. ప్రస్తుతం గుర్తింపు, ధ్రువీకరణ పత్రాలు పొందేందుకు జనన ధ్రువీకరణ పత్రం తప్పనిసరి చేయడంతో అవస్థలు తప్పడం లేదు. ఆధార్, పాస్‌పోర్టు, పాన్‌కార్డులాగే జనన ధ్రువీకరణ పత్రం కీలకంగా మారుతోంది. విద్యార్థులు పాఠశాలలో చేరేందుకు జనన పత్రం ఉంటేనే నమోదు ప్రక్రియ కొనసాగుతుంది. విదేశాల్లో ఉద్యోగాలు చేస్తున్నవారుండగా చాలామంది ఉన్నత చదువులు చదువుతున్నారు. వారి తల్లిదండ్రులు విదేశీ పర్యటనకు వెళ్లేందుకు పాస్‌పోర్ట్ తప్పనిసరి. వారికి జనన ధ్రువీకరణ పత్రం పొందాలంటే తిప్పలు తప్పడం లేదు. ఆధార్‌లో మార్పులు చేయాలంటే జనన ధ్రువీకరణ పత్రమే కీలకంగా మారింది.

బర్త్ సర్టిఫికెట్ పొందడమిలా..

జనన ధ్రువీకరణ పత్రానికి ముందుగా పంచాయతీ కార్యదర్శి/మునిసిపల్ ఇచ్చిన ఫాం- 10 ఆధారంగా నోటరీ తీసుకోవాలి. ఆ రెండింటితో పాటు మరో రెండు ఫాంలు తీసుకుని ప్రభుత్వ ఉద్యోగులతో ధ్రువీకరించుకోవాలి. మండలస్థాయి అధికారి (గెజిటెడ్) సంతకం అవసరం అవుతుంది. ఈ పత్రాలన్నీ జత చేసి మీసేవలో దరఖాస్తు చేయాలి, తహసీల్ కార్యాలయంలో అందజేస్తే అక్కడ పత్రాలను సరిచూసి ఆర్డీవో కార్యాలయానికి పంపుతారు. అక్కడినుంచి పత్రం జారీ కోసం నెలల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. నిరక్షరాస్యులు దళారులను ఆశ్రయించి ఎంతో, కొంత చెల్లించి ఆర్థికంగా నష్టపోతున్నారు. అయినప్పటికీ పత్రాలు అందడం లేదని పలువురు వాపోతున్నారు.

దళారులను ఆశ్రయించొద్దు

జనన ధ్రువీకరణ పత్రం నిబంధనల మేరకు తీసుకోవాలి. దళారులను ఆశ్రయిస్తే తప్పులు చోటుచేసుకునే అవకాశముంది. మాయమాటలు చెప్పి అమాయకుల నుంచి డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

– కుందారపు మహేశ్వర్, ఆర్డీవో, కరీంనగర్

అప్పు చెల్లించడం లేదని వ్యక్తి ఆత్మహత్యాయత్నం


సెల్ఫీ వీడియోలో మాట్లాడుతున్న కృష్ణ

హుజూరాబాద్: అప్పు తీసుకున్న వ్యక్తి తిరిగి ఇవ్వకపోవడంతో ఇచ్చిన వ్యక్తి మనోవేదనకు గురై ఆత్మహత్యకు యత్నించిన ఘటన సోమవారం పట్టణంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు.. హుజూరాబాద్ పట్టణానికి చెందిన పంజాల కృష్ణ, హోటల్ వ్యాపారి వనం హరీశ్‌కు రూ.25లక్షలు అప్పు ఇచ్చాడు. అప్పు తీసుకుని ఏడాదైనా హరీశ్ చెల్లించలేదు. తాను వేరేవారి వద్ద అప్పు తెచ్చానని, ఇబ్బందిపెడుతున్నారని, అప్పు చెల్లించాలని కృష్ణ హోటల్ వద్దకు వెళ్లి హరీశ్‌ను కోరగా బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన కృష్ణ పట్టణంలోని హైస్కూల్ గ్రౌండ్ వద్ద గడ్డిమందు తాగాడు. స్థానికులు గుర్తించి ప్రభుత్వ ఆస్పత్రికి, మెరుగైన వైద్యం కోసం జమ్మికుంటలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతడి పరిస్థితి విషమంగా ఉందని బంధువులు తెలిపారు. హరీశ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. కాగా ఆత్మహత్యాయత్నానికి ముందు కృష్ణ సెల్ఫీ వీడియో సైతం తీశారు.

అంజిరెడ్డి జన్మదిన వేడుకలు

కరీంనగర్: కరీంనగర్‌లోని కోటా ఇన్‌స్టిట్యూట్ ఛైర్మన్, ప్రముఖ విద్యావేత్త డి. అంజిరెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. జాతీయ బీసీ విద్యార్థి సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు సిరిశెట్టి రాజేశ్ గౌడ్ హాజరై అంజిరెడ్డికి మెమెంటో అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అంజి రెడ్డి విద్యారంగంలో ప్రజల విశ్వాసాన్ని గెలుచుకున్న అరుదైన వ్యక్తిత్వం గల వారని అన్నారు. వారు మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.


మెమెంటో అందజేస్తున్న సిరిశెట్టి రాజేశ్